నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, శుక్రవారం 20 జూన్ 2025 | SIDDIPET

సిద్దిపేట జిల్లా తొగుట వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- పొద్దు తిరుగుడు ధాన్యం డబ్బులు చెల్లించాలని సిద్దిపేట జిల్లా తొగుటలో రైతుల ఆందోళన
- కర్షకుల ఆందోళనకు సంఘీభావం తెలిపిన బీఆర్ఎస్ నాయకులు

మిరుదొడ్డి, జూన్ 19 : ఆరుగాలం కష్టపడి పడించి విక్రయించిన పొద్దు తిరుగుడు ధాన్యం డబ్బులు చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తొగుట సొసైటీ చైర్మన్ కె.హరికృష్ణారెడ్డి, బీఆర్ఎస్ తొగుట మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి ఆరోపించారు. పొద్దు తిరుగుడు ధాన్యాన్ని విక్రయించి 75 రోజులు గడుస్తున్నా నేటికి రాష్ట్ర ప్రభుత్వం డబ్బులు చెల్లించక పోవడంలో ఆగ్రహానికి గురైన రైతులు గురువారం సిద్దిపేట జిల్లా తొగుట వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. రైతులు చేస్తున్న ఆందోళనకు బీఆర్ఎస్ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొద్దు తిరుగుడు సెంటర్ ప్రారంభించినప్పటి నుంచి ధాన్యం కొనుగోలు చేసే వరకు రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేసిందన్నారు. తొగుట సెంటర్ పరిధిలో నాలుగు వందల మంది రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.3 కోట్ల బకాయిలు చెల్లించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మార్పు అంటే ధాన్యం విక్రయించిన రైతులు డబ్బుల కోసం రోడ్ల మీదికి రావడమేనా అంటూ ప్రశ్నించారు. స్థానిక ఎన్నికల పేరుతో రైతులను మభ్య పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని మండిపడ్డారు. బకాయి పడిన పొద్దుతిరుగుడు రైతులకు వెంటనే డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులు చేస్తున్న ఆందోళన వద్దకు పోలీసులు చేరుకొని సముదాయించడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ యాదగిరి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొమురయ్య, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు మల్లారెడ్డి, నాయకులు నర్సింహులు, వెంకట్‌రెడ్డి, బాగిరెడ్డి, అశోక్, రాములు, స్వామిగౌడ్, రైతులు పాల్గొన్నారు.

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హైమావతి

పనుల నిర్వహణ ఇలా ఉంటే ఎలా?

- పనులు పరుగులు పెట్టాలి, మళ్లీ సమీక్షిస్తా
- సిద్దిపేట కలెక్టర్ హైమావతి
- హుస్నాబాద్‌లో ఆకస్మిక తనిఖీలు
- వైద్యసిబ్బంది గైర్హాజరు, పనుల నిర్వహణపై అసంతృప్తి

హుస్నాబాద్‌టౌన్, జూన్ 19: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మున్సిపల్‌తోపాటు ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ విభాగాల్లో పనుల నిర్వహణ తీరుపై సిద్దిపేట కలెక్టర్ హైమావతి అసంతృప్తి వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మున్సిపల్‌కార్యాలయంలో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, మున్సిపల్, ఆర్‌డబ్ల్యూఎస్‌శాఖల పనులపై గురువారం ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన పనులప్రగతి వివరాలు సరిగ్గా లేవని ఏఈ మహేశ్‌ను ప్రశ్నించారు. మంజూరైన నిధులతో ఎంతపనిజరిగిందనే వివరాలు లేకుండా కేవలం ఫ్రోగెస్ అని ఇవ్వడం ఏమిటని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతివార్డుకు కేటాయించిన పనుల వివరాలన్నీ ఇలా ఉండటం ఏమిటని, తప్పకుండా పనులకు సంబంధించి స్పష్టత ఉండాలని, త్వరలోనే మరోసారి సమీక్ష చేస్తానని కలెక్టర్ స్పష్టం చేశారు. గౌరవెల్లి ప్రాజెక్టుపై సమీక్ష సందర్భంగా రిజర్వాయర్ 90శాతం పూర్తికావడం జరిగిందని, ఎన్‌జీటీ కేసు వల్ల ఆగిపోయిందని ఇరిగేషన్‌శాఖ ఈఈ రాములు, అధికారులు కలెక్టర్‌కు వివరించారు. 45ఎకరాలకు పరిహారం ఇవ్వాలని, ట్రయల్ రన్‌చేసేందుకు నిబంధనల ప్రకారం భూముల పరిహారం బ్యాంకులో డిపాజిట్ చేయడం జరిగిందని తెలిపారు. హుస్నాబాద్ నుంచి రామవరం వరకు శంకుస్థాపన చేసిన పనులు ఎందుకు ప్రారంభం కాలేదో చెప్పాలని, దీనిపై రోజువారి ప్రగతి నివేదిక ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. హుస్నాబాద్, కోహెడ తదితర మండలాల్లో పలు రహదారుల పనులకు సంబంధించి కాంట్రాక్ట్ పనులను లక్కీఏజెన్సీ దక్కించుకున్నప్పటికీ పనులు జరగడంలేదనే విషయాన్ని కలెక్టర్ హైమావతి సమీక్షలో గుర్తించారు. ఈ సందర్భంగా దాదాపు తొమ్మిది పనులను లక్కీ ఏజెన్సీకి రావడం జరిగిందని, అన్ని పనులు ప్రారంభంకాలేదని పీఆర్‌డీఈఈ మహేశ్ వివరించగా వారికి లక్కీ ఉందికానీ మనం అన్‌లక్కీ అని అన్నారు. జిల్లాలో హెల్త్ సబ్‌సెంటర్లు, పంచాయతీ భవనాలు ఈజీఎస్‌లో కట్టేందుకు ముందుకురావడంలేదని కలెక్టర్ ఆరాతీశారు. దీనిపై పీఆర్‌ఈఈ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఆరేండ్లక్రితం అంచనాలతో తయారుచేసిన ధరలు నేటికి ఉండటంతో పనుల నిర్వహణ చేయలేని పరిస్థితి ఉందని కలెక్టర్‌కు వివరించారు. అంతకుముందు జిల్లాపరిషత్ బాలికల ఉన్నతపాఠశాలను కలెక్టర్ తనిఖీచేసి విద్యార్థులతో మాట్లాడి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం హుస్నాబాద్ ప్రభుత్వ దవాఖానను తనిఖీచేసి వివిధ విభాగాలను పరిశీలించారు. కొందరు సిబ్బంది గైర్హాజరు కావడంపై కలెక్టర్‌హైమావతి అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక ఎల్లమ్మచెరువుసుందరీకరణ పనులను కలెక్టర్ పరిశీలించారు. హుస్నాబాద్ ప్రభుత్వ దవాఖానకు మంజూరైన బ్లడ్‌బ్యాంక్‌కు సిబ్బందిని కేటాయించాలని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ లింగమూర్తి కలెక్టర్‌ను కోరారు. సమీక్షలో హుస్నాబాద్ ఆర్డీవో రామమూర్తి, ఆర్‌అండ్‌బీఈఈ నరేందర్, హుస్నాబాద్ దవాఖాన సూపరింటెండెంట్ రమేశ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్ పాల్గొన్నారు.

వెక్కిరిస్తున్న క్రీడా ప్రాంగణాలు

- పంచాయతీలకే పరిమితమైన స్పోర్ట్స్ కిట్లు
- గ్రామీణ క్రీడాకారులకు అందని ప్రోత్సాహం
- పట్టించుకోని కాంగ్రెస్ సర్కారు
- ప్రభుత్వం దృష్టి సారించాలంటున్న క్రీడాకారులు

పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్న మైదానాలు

క్రీడాకారులను ప్రోత్సహించి మట్టిలోని మాణిక్యాలను వెలికి తీసే ఉద్దేశంతో బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాలు, పట్టణాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ క్రీడా ప్రాంగణాలను పట్టించుకోవడం లేదు. దీంతో వాటిని వినియోగంలోకి తీసుకురాకపోవడంతో గడ్డి మొలిచి పిచ్చిమొక్కలతో అధ్వానంగా తయారయ్యాయి. క్రీడాకారులకు ఇక్కట్లు తప్పడం లేదు.

మెదక్ మండలంలోని మల్కాపూర్ తండాలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణంలో మొలిచిన పిచ్చిమొక్కలు

మెదక్, జూన్ 19 (నమస్తే తెలంగాణ) : క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గ్రామాలు, పట్టణాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. కానీ వాటిని వినియోగంలోకి తీసుకురాక పోవడంతో నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఒక్కో ప్రాంగణానికి క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. కానీ వాటిని బయటకు తీసి ఆటలు ఆడిన దాఖలాలు ఎక్కడా లేవు. క్రీడా ప్రాంగణాలను పట్టించుకునే నాథుడు లేడు. దీంతో గడ్డి మొలిచి పిచ్చి మొక్కలతో అధ్వానంగా తయారయ్యాయి. కొన్ని చోట్ల పశువులు సంచరిస్తూ గడ్డిమేస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. మరికొన్ని క్రీడా ప్రాంగణాలు మందుబాబులకు అడ్డాగా మారాయి. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ కోర్టులతో పాటు లాంగ్ జంప్ పిట్, వ్యాయామం కోసం సింగిల్, డబుల్ బార్లు ఉండాలి, కానీ క్షేత్రస్థాయిలో కొన్ని చోట్ల అవి ఎక్కడా కనిపించడం లేదని క్రీడాకారులు వాపోతున్నారు. ఆట స్థలాల చుట్టూ నీడనిచ్చే మొక్కలు నాటి ఆహ్లాదకరంగా తీర్చిదిద్ది సంరక్షించాల్సిన గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు పట్టించుకోవడం లేదు.

అటకెక్కిన క్రీడా సామగ్రి

మెదక్ జిల్లాలోని పలు క్రీడా ప్రాంగణాలకు 2023లో కిట్లు పంపిణీ చేశారు. ఒక్కో క్రీడా యూనిట్ విలువ రూ.68వేలు ఉంటుంది. ఇందులో జిమ్ పరికరాలతో పాటు క్రికెట్, వాలీబాల్ ఆటలకు సంబంధించిన సామగ్రి ఉంది. కానీ చాలా చోట్ల వినియోగంలో లేక గ్రామ పంచాయతీ గదుల్లో మూలన పడేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలను అందుబాటులోకి తీసుకురావాలని క్రీడాకారులు కోరుతున్నారు.

పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్న మైదానాలు

మెదక్ జిల్లాలోని 469 గ్రామ పంచాయతీలతో పాటు 81 హ్యాబిటేషన్లు ఉండగా, 456 గ్రామ పంచాయతీల్లో ఒకటి చొప్పున క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. ఒక్కో గ్రామ పంచాయతీలో 2వేల చదరపు గజాలు లేదా 20 గుంటలకు తగ్గకుండా భూమిని కేటాయించారు. ఇందుకోసం రూ.2.50 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఖర్చుచేసి తెలంగాణ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. చాలా గ్రామాల్లో స్థలాల కొరత ఉండడంతో పాఠశాల ప్రాంగణాలు, ఖాళీగా ఉన్న కొద్దిపాటి స్థలాల్లో, వైకుంఠధామాల పక్కన తెలంగాణ ప్రాంగణం పేరిట బోర్డు, వాలీబాల్ కోర్టు, వ్యాయామం చేసేందుకు రెండు పరికరాలు ఏర్పాటు చేసి నామ్‌కే వాస్తేగా వదిలేశారు. కొన్ని చోట్ల కేవలం క్రీడా ప్రాంగణాల పేరుతో బోర్డులు పెట్టి ఇతరత్రా వసతులను విస్మరించారు. పట్టణాల్లోనూ వార్డుకో క్రీడా ప్రాంగణం ఉండాల్సి ఉండగా స్థలం కొరత వల్ల నాలుగు మున్సిపాలిటీల పరిధిలో అక్కడక్కడా క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. నిర్వహణ సక్రమంగా లేక పిచ్చిమొక్కలు పెరిగి అధ్వానంగా మారాయి. మరో వైపు నిధుల కొరత వల్ల పంచాయతీలు వీటి నిర్వహణ చేపట్టలేక పూర్తిగా గాలికొదిలేశాయని పలువురు పేర్కొంటున్నారు. గతంలో పంపిణీ చేసిన స్పోర్ట్స్ కిట్స్‌లోని సామగ్రిస్పోర్ట్స్ కిట్లలో మేజరింగ్ టేపు 1, డిస్కస్‌త్రో 1, 2 కిలోలు, టెన్నికాయట్ రింగులు 6, స్కిప్పింగ్ రోప్‌లు 6, ప్లాస్టిక్ విజిల్స్ 3, స్టాప్ అండ్ గో వాడెన్ 1, సింథటిక్ వాలీబాల్ 1, నెట్ 1, సైకిల్ పంపు, బిగ్ సైజ్ (పుట్‌పంపు)1 ఉంటాయి. డంబెల్స్ మూడు సెట్లు, టీషర్టు 75, క్రికెట్ బ్యాట్ నం.5, బ్యాటింగ్ గ్లౌజ్‌లు ఒక జత, లెగ్ ప్యాడ్లు రెండు జతలు, వికెట్ కీపింగ్ లెగ్ గార్డు ప్యాడ్ ఒక జత, స్టంప్స్ సెట్ 2 జతలు, లబ్డామినల్ గార్డ్స్ 2 జతలు, ప్రాక్టిస్ బాల్స్ 6, ఆర్మ్‌గార్డ్స్ 2, క్రికెట్ కిట్ బ్యాగ్ 1 ఉన్నాయి.

ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీతో రైతులకు మేలు

సిద్దిపేట జిల్లా నర్మెటలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ పనులను పరిశీలించిన కేంద్ర బృందం

నంగునూరు, జూన్ 19 : సిద్దిపేట జిల్లా నంగునూరు మండల పరిధిలోని మైసంపల్లి గ్రామంలో మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి ఆయిల్‌పామ్ తోటను గురువారం కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ అధికారులు పరిశీలించారు. అనంతరం మండల పరిధిలోని నర్మెట గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ పనులను కేంద్ర అధికారుల బృందం పరిశీలించి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నర్మెట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ అత్యంత ఆధునిక టెక్నాలజీతో నిర్మిస్తున్నారని, రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈఫ్యాక్టరీ భారతదేశంలోనే అత్యంత పెద్దదని, ఫ్యాక్టరీ నిర్మాణం అద్భుతంగా ఉందని వారు ప్రశంసించారు. భవిష్యత్‌లో ఈ ప్రాంతానికి చెందిన రైతులకు ఫ్యాక్టరీ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణకాంత్‌దూబే, ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి, ఫ్యాక్టరీ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, డీహెచ్‌వో సువర్ణ, ఆయిల్‌ఫెడ్ జిల్లా మేనేజర్ భాస్కర్‌రెడ్డి, హార్టికల్చర్ ఆఫీసర్ బాలాజీ, ఫీల్డ్ ఆఫీసర్ నితీశ్‌కుమార్ పాల్గొన్నారు.

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న కేంద్ర అధికారుల బృందం



సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

స్థానిక ఎన్నికల కోసమే రైతుభరోసా

- రైతులను ముంచిన రేవంత్ ప్రభుత్వం
- మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, జూన్ 19: స్థానిక ఎన్నికల వేళ మరోసారి రైతులను మోసం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా తెరమీదికి తెచ్చిందని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కేసీఆర్ ప్రభుత్వం ఇస్తున్న ఎకరాకు రూ.10 వేల రైతుబంధుకు బదులు రూ.15 వేల రైతుభరోసా ఇస్తామని అధికారం చేపట్టిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం రూ.12 వేలకు తగ్గించడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులపై చిత్తశుద్ధి ఉంటే గత రెండు పంటల రైతుభరోసాతో కలిపి మొత్తం మూడు పంటలకు పెట్టుబడి సాయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కి రైతులను నిండా ముంచిన కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్పి చేసిన మోసానికి ప్రతీకారం తీర్చుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు. సన్న వడ్లకు బోనస్ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం గత ఖరీఫ్‌కు మాత్రమే బోనస్ ఇచ్చిందని, యాసంగి పంట బోనస్ ఇవ్వలేదని గుర్తు చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇష్టారీతిన దోపిడీ జరిగిందని, క్వింటాల్ ధాన్యానికి 5 నుంచి 10 కిలోల తరుగు, క్వింటాల్ జొన్నలకు ఐదు కిలోల చొప్పున తరుగు విధించి రైతులను నష్టపర్చడమే కాకుండా పొరుగు రాష్ట్రాల జొన్నలను కొనుగోలు చేసి సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. రూ.2 లక్షల పంట రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి ఇంకా 70 శాతం మందికి చేయకుండానే అసంపూర్తిగా ముగించారన్నారు. వ్యవసాయ ఉపకరణాలు, విత్తనాలకు సబ్సిడీ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నిరాశకు గురి చేసిందన్నారు. కౌలు రైతులకు రైతుభరోసా ఇస్తామని, వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామన్న హామీలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికలను అవకాశంగా మలచుకుని రైతులు అన్ని స్థానాల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, నాయకులు రవీందర్‌నాయక్, ఎం.ఏ.నజీబ్, ఆహీర్ పరశురామ్, నాగేందర్ పాటిల్, ముజామిల్, వెంకటేశం, విఠల్‌రావు, సాల్మన్, రాజునాయక్, వెంకట్‌నాయక్ పాల్గొన్నారు.

గది ఒక్కటే.. తరగతులు రెండు

- సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలంలోని కూటిగల్‌లో శిథిలావస్థకు చేరిన తరగతి గదులు
- గదులు లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలం కూటిగల్ పాఠశాలలో ఒక గదిలోనే కొనసాగుతున్న నాలుగు, ఐదు తరగతులు

మద్దూరు(ధూళిమిట్ట), జూన్19: తరగతి గదిలోనే విద్యార్థుల భవిష్యత్ నిర్ణయమవుతుందని, విద్యార్థుల తలరాతను మార్చేది తరగతి గది మాత్రమేనని తరగతి గది గొప్పతనాన్ని పెద్దలు గొప్పగా చెప్పేవాళ్లు. అయితే ఆ పాఠశాల విద్యార్థులకు ఆతరగతి గదులు శాపంగా మారాయి. సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలంలోని కూటిగల్ ప్రాథమిక పాఠశాలలో సుమారు 80మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి ముగ్గురు ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నారు. పాఠశాలలోని తరగతి గదులు శిథిలావస్థకు చేరుకొని పైకప్పు పెచ్చులూడుతున్నది. దీంతో అరకొరగా అందుబాటులో ఉన్న తరగతి గదుల్లోనే విద్యనభ్యసించాల్సిన దుస్థితి నెలకొన్నది. విద్యార్థుల కోసం నాలుగు తరగతి గదులు ఉండగా అందులో రెండు శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రస్తుతం రెండు గదులు మాత్రమే అందుబాటులో ఉండడంతో ఒక్కో తరగతి గదిలో రెండు తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో ఎడమ వైపు నాలుగో తరగతి విద్యార్థులు, కుడి వైపు ఐదోతరగతి విద్యార్థులు పాఠాలు వింటున్నారు. 1, 2,3 తరగతి విద్యార్థులకు పాఠశాలగది, పాఠశాల వరండాలో ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నారు. ఒక తరగతి గదిలోనే రెండు తరగతుల నిర్వహణతో విద్యార్థులు సరిగ్గా పాఠాలు వినలేని పరిస్థితి నెలకొంది. తరగతి గదులు లేక విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల బాట పడుతున్నారు. తరగతి గదులు నిర్మించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు చొరవ తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



కూటిగల్ పాఠశాలలో పెచ్చులూడిన తరగతిగది పైకప్పు

'రైతు భరోసా' కోసం పటాన్‌చెరు ఎమ్మెల్యే లేఖ

పటాన్‌చెరు రూరల్, జూన్ 19: నమస్తే తెలంగాణ దినపత్రికలో బుధవారం ప్రచురితమైన పటాన్‌చెరు డివిజన్‌కు రైతు భరోసా బంద్ కథనంపై పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి స్పందించారు. గురువారం ఆయన రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయశాఖమంత్రికి పటాన్‌చెరు అసెంబ్లీ నియోజకవర్గంలోని రైతులకు రైతు భరోసా నిధులు విడుదల చేయాలని లేఖ రాశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు భరోసా పెట్టుబడి సాయం పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాలకు అందడం లేదని లేఖలో పేర్కొన్నారు. పటాన్‌చెరు, జిన్నారం, అమీన్‌పూర్, రామచంద్రాపురం మండలాల్లో వ్యవసాయం చేస్తున్న రైతుల అకౌంట్లలో డబ్బులు జమ కాలేదని తెలిపారు. కేవలం గుమ్మడిదల మండలంలోని రైతుల అకౌంట్లలోనే రైతు భరోసా నిధులు జమ అయ్యాయన్నారు. మిగిలిన నాలుగు మండలాల్లో రైతులు వ్యవసాయం చేస్తున్నారని పేర్కొన్నారు. 27,120 మంది రైతులు ఉన్నారని తెలియపర్చారు. రూ. 12.99 కోట్ల రైతు భరోసా వారిఅకౌంట్లలో జమచేయాల్సి ఉందన్నారు.

వైరల్ అయిన నమస్తే కథనం

పటాన్‌చెరు డివిజన్‌లో రైతు భరోసా బంద్ కథనం వైరల్ అయ్యింది.జిల్లాలోని అన్ని మండలాల్లో డబ్బులు జమఅవుతుండటం తమ అకౌంట్లలో ట్రింగ్..ట్రింగ్ అనే సౌండ్ రాకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. విషయం గ్రహించిన రైతులు, పలు పార్టీల నాయకులు నమస్తే తెలంగాణ దినపత్రిక కథనాన్ని వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ చేశారు. పలువురు నాయకులు, రైతులు తమ స్టేటస్‌లో పెట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయం గ్రహించిన ఎమ్మెల్యే సైతం ప్రభుత్వం చేసిన తప్పును సరిచేసేందుకు తనవంతుగా వ్యవసాయశాఖ మంత్రికి లేఖ రాశారు. రైతు భరోసా ఇప్పుడు పటాన్‌చెరు ప్రాంత రైతులు, ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.

GUDEM MAHIPAL REDDY
M.L.A
Patancheru Assembly Constituency-48
Sangareddy District, TELANGANA STATE

CAMP OFFICE :
H.No. 9-3, RAM MANDIR ROAD,
PATANCHERU, SANGAREDDY DIST.
TELANGANA STATE.
Cell : 9490399016, 9000499016
9440881016, 9441581230

తేదీ:19.06.2025

తెలుగు రాష్ట్రాల వ్యవసాయ శాఖ మంత్రివర్యులు , తెలంగాణ రాష్ట్రము, హైదరాబాద్.
గారికి నమస్కారములు.
అన్న,
విషయం: పటాన్చెరు అసెంబ్లీ నియోజకవర్గములోని రైతులకు "రైతు భరోసా" నిధులు జమచేయుటకుగల విన్నపం - గురించి.
తమరికి తెలియజేయునది మనదేశములోని మెజారిటీ మంది ప్రజలకు ప్రత్యేకించి అధికులు చేయుచున్న "రైతు భరోసా" పథకమును పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలలోని అకౌంట్లు, ఉత్పత్తి, అమీనుపూర్ మరియు రామచంద్రాపురం మండలములోని రైతుల ఖాతాలలో జమకానందున లేక, కేవలము పటాన్చెరు నియోజకవర్గములోని గుమ్మడిదల మండలములో మాత్రమే జమ అయినట్లు తెలిసింది.
జమకాని రైతుల సంఖ్య 27120
ప్రభుత్వానికి పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి రాసిన లేఖ